క్లుప్తంగా

ఉర్దూ పాఠశాలల్లో వీవీలను నియమించండి



వినతిపత్రం అందజేస్తున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉర్దూ మీడియం పాఠశాలల్లో ప్రత్యేక వి ద్యావలంటీర్లను నియమించాలని ఎస్‌సీఈ ఆర్‌టీ డైరెక్టర్ రమేశ్‌ను కెరమెరి ఎంఈవో ఆడే ప్రకాశ్ కోరారు. హైదరాబాద్‌లో మూడు రోజుల నుంచి ఎంఈవోలకు కొనసాగుతున్న శిక్షణలో భాగంగా బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలోని కెరమెరి, జైనూర్ మండలాల్లో ఉన్న ఉ ర్దూ మీడియం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో గడిచిన ఐదేళ్లుగా ఉపాధ్యాయులు లేక తెలుగు మీడి యం ఉపాధ్యాయులతో నెట్టుకొస్తున్నామన్నారు. ఏజెన్సీ మండలాలు కావడంతో గిరిజనుల్లో ఉర్దూ చదివిన వారు లేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. స్పందించిన డైరెక్టర్ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ప్రకాశ్ తెలిపారు.

ఎంఈవో సుభాష్‌కు సన్మానం



ఎంఈవోను సన్మానిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉత్తమ మానిటరింగ్ అధికారిగా ఎంఈవో సుభాష్ ఎంపికైన సందర్భంగా బుధవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్‌గౌడ్ ఎంఈవోను సన్మానించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ కార్యాలయంలో ఎంఈవోల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో యాప్ ద్వారా మానిటరింగ్ చేయగా మల్టీజోన్ పరిధిలో పాల్గొన్న ఎంఈవోల్లో ఉత్తమ మానిటరింగ్ అధికారిగా ఆసిఫాబాద్ ఎంఈవో ఎన్నికయ్యారు.

మున్నూరుకాపు సంఘం ఎన్నికలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న బోరిగం రాజారాం

రెబ్బెన: మున్నూరు కాపు కులస్తులు ఒకే కులం, ఒకే సంఘం అనే నినాదంతో రాష్ట్ర ఎన్నికలకు సన్నద్ధం కావాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని మున్నూరు కాపు కులస్తులంతా ఒకే తాటిపై ఉండేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జూన్ చివరి వారంలో రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తున్నామని దానికి అన్ని జిల్లాల, మండలాల, గ్రామాల అధ్యక్షుడు, కార్యదర్శులు, కులపెద్దలు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్న సోమశేఖర్, ఆకుల సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు అన్నం రమేశ్, మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, యువ నాయకులు సాయి సుప్రజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జొన్న రైతుల ఆందోళన



జొన్న పంట పరిశీలిస్తున్న ఏవో ఆకాష్

నార్నూర్: గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జొన్న రైతులు బెంబేలెత్తుతున్నారు. చేతికొచ్చిన పంట చేజారిపోతుండడంతో రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. నార్నూర్ మండలంలోని మాన్కాపూర్, రాజులగూడ, తాడిహత్నూర్, గంగాపూర్, నాగల్ కొండ శివారులో దాదాపు 1500 పైగా ఎకరాల్లో రైతులు జొన్న సాగు చేస్తున్నారు. దాదాపు 60 శాతం మంది రైతులు జొన్న పంటను సాగు పూర్తి చేయగా.. మిగితా 40శాతం మంది రైతులు పంట కోయలేదు. దీంతో చేతికొచ్చిన పంట చేజారిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కేంద్రే ఆకాష్ దెబ్బతిన్న జొన్న పంటను పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు.



బురదమయంగా రోడ్డు

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ హనుమాన్ ఆలయం నుంచి రంగాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు వరకు ఉన్న మట్టిరోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బురదమయమై వాహనాలతో పాటు కాలినడకన వెళ్లేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు గుండా చిన్నసిద్దాపూర్, పెద్ద సిద్దాపూర్, ఎలుకపెల్లి, రంగాపూర్ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వెళ్తుంటారు.



రైతులకు దారి తిప్పలు

కౌటాల: తొలకరి వర్షాలకే వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులు బురదమయంగా మారాయి. కౌటాల మండలం గురుడుపేట -కనికి రోడ్డు మార్గం ఇరువైపులా వందల ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం రోడ్డు బురదమయంగా మారింది. రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడడంతో దారి గుండా వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



మార్కెట్‌లో 'మురుగు'

జిల్లా కేంద్రంలోని జుబ్లీ కూరగాయల మార్కెట్‌లో వర్షపు నీరు రోడ్డుపైకి చేరడంతో అధ్వానంగా తయారైంది. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. అయినా గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జుబ్లీ మార్కెట్‌లో మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. – ఆసిఫాబాద్‌అర్బన్

కూల్‌గా రోహిణి కార్తె!



పెంచికల్‌పేట్‌లో కమ్ముకున్న మేఘాలు

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- ఎండల నుంచి ఉపశమనం

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (మే 28న)..

ప్రాంతం	గతేడాది	ఈసారి
జంబుగా	44.3	34.0
కౌటాల	43.3	33.8
కాగజ్‌నగర్	42.7	34.6
సిర్పూర్(టి)	42.5	34.2
వంకులం	42.1	35.6
లోనవెల్లి	42.0	33.6

కౌటాల: జిల్లాలో రోహిణి కార్తె కాలం ప్రారంభమైంది. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు(బండలు) పగిలేలా ఎండలు ఉంటాయని నానుడి ఉంది. కానీ ఈసారి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు వాతావరణం చల్లబడింది. నైరుతి రుతుపవనాలు కేరళను తాకడంతో ఇప్పుడు ఎండలు మండే పరిస్థితులు లేకపోవడంతో ఈసారి జిల్లా వాసులు వేసవి తాపం, వడగాలులు బారి నుంచి బయట పడ్డామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది ఇబ్బందులు..

జిల్లాలో గత ఏడాది పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యాయి. ఒకవైపు అత్యధిక ఉష్ణోగ్రతలు.. మరోవైపు ఉక్కపోత.. వీటికి తోడు వడగాలుల ప్రభావంతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. భూగర్భ జలాలు సైతం ఎండిపోవడంతో పలు గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పలేదు. ఈసారి ఏప్రిల్‌లో సైతం ఎండలు దంచికొటటాయి. మే నెలలో ఎండలు ఏ స్థాయిలో ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందారు. కానీ మే మొదటి వారం నుంచి జిల్లాలో అడపదడపా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా జిల్లాలో వాతావారణం చల్లబడింది. కొన్ని రోజుల పాటు భారీగా నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పతనమయ్యాయి. వడగాలుల తీవ్రత సైతం తగ్గడంతో ప్రజలకు ఈ వేసవి ఉపశమనం కలిగింది.

రెడ్ జోన్ నుంచి వాచ్‌జోన్‌లోకి..

జిల్లాలో ఈసారి మార్చి మొదటి వారం నుంచే సూరీడు తన ప్రతాపం చూపించాడు. ఇక ఏప్రిల్ చివరి వారంలో వీచిన వడగాలులకు జనం బెంబేలెత్తిపోయారు. ఉదయం 8 గంటల నుంచే వేడి ప్రారంభమై మధ్యాహ్నం 10 గంటల తర్వాత బయటకు రాలేనంత తీవ్రమైంది. తిర్యాణి, కెరమెరి మండలాల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో పలువురు వడదెబ్బ బారిన పడి మృతి చెందారు. మిగితా మండలాలు అలర్ట్ జోన్‌లో ఉన్నాయి. కానీ అకాల వర్షాలతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. గత మూడు వారాలుగా జిల్లాలోని 15 మండలాలు పరిశీలించు(వాచ్) జోన్‌లో ఉన్నాయి. దీంతో వేసవి తాపంతో పాటు మే గండం నుంచి గట్టెక్కారు.

'ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పంచాయతీ కార్యదర్శులదే కీలకపాత్ర అని కలెక్టర్ వెంకటేశ్ దోత్రె అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛ భారత్ మిషన్, అగాఖాన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల అధికారులతో నిర్వహించిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టడం, తడి, పొడి చెత్తలు సేకరించడం, మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు, రహదారుల శుభ్రత, బహిరంగ మల, మూత్ర విసర్జన లేకుండా ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వంటి చర్యలతో గ్రామాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్, ఎస్‌బిఆర్‌డీ రాష్ట్ర సమన్వయకర్త సుభాష్, యూనిసెఫ్ ప్రతినిధి మహాలక్ష్మి, రాష్ట్ర శిక్షకులు రమేశ్, ఆగాఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు నజీర్, సెల్వరాజ్, కిరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె

గదుల నిర్మాణానికి భూమిపూజ

దహెగాం: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఎంపీ లాడ్స్ కింద ప్రెస్‌క్లబ్ అదనపు గదుల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు భూమిపూజ చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మించుకున్న పాత్రికేయులను అభినందించారు. అదనపు గదుల నిర్మాణం కోసం ఎంపీ నగేశ్ దృష్టికి తీసుకెళ్లి రూ.5 లక్షలు మంజూరు చేయించామన్నారు. ప్రెస్‌క్లబ్‌లో రీడింగ్ రూంను పరిశీలించారు. యువత వచ్చి ఉద్యోగాల కోసం చదువుకోవాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు లగ్గామ దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పోతుగంటి భీమన్న, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్, నాయకులు చెమ్మకారి రమేశ్, అల్లం మల్లేశ్, పడాల సురేశ్, సత్యం, ప్రదీప్, వ్యాపారులు తోట రాజు, రాపర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సేంద్రియ పంటలతో అధిక లాభాలు

కెరమెరి: సేంద్రియ పంటలతో అధిక లాభాలు గడించవచ్చని రైతు సంఘం అధ్యక్షుడు కేంద్రె బాలా జీ అన్నారు. బుధవారం మండలంలోని కొఠారి గ్రా మంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ యన మాట్లాడారు. ప్రతీ రైతు తనకున్న పొలంలో కొంత సేంద్రియ పంటలు పండించాలన్నారు. ఆ హార ధాన్యాలు కూడా పండించాలని, సేంద్రియంతో పండించిన ఆహార ధాన్యాలను ఆరగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. సేంద్రియ రైతులు రాంచందర్, మహాదు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న బాలాజీ

రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: రైతు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఈవో రెహమాన్ అన్నారు. బుధవారం మండలంలోని అప్పపల్లి, మోతుగూడ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ రైతు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, సెల్‌ఫోన్ నంబర్‌కు లింక్ చేయడంతో కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఏఈవో

నేటి రిలే నిరాహార దీక్షకు తరలిరావాలి

పెంచికల్‌పేట్: ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆదిమ గిరిజన భూరక్షణ పోరాట కమిటీ, రాజ్‌గోండ్ సేవా సమితి, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే శాంతియుత నిరసన దీక్షకు ఆదివాసీలు తరలిరావాలని రాయిసెంటర్ మండల సార్మేడీ పార్శెటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కుల కోసం తరలివచ్చి దీక్ష విజయవంతం చేయాలని కోరారు.

ఆక్రమణలో 'డ్రెయినేజీ'!



పట్టణంలోని తీరందాస్ టాకీసు వెనకాల ఆక్రమణకు గురైన మురుగు కాలువ స్థలం



కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద కల్వర్టు సమీపంలో ఆక్రమణకు గురైన మురుగు కాలువ స్థలం



దోబీఘాట్ సమీపంలో కుచించుకుపోయిన ప్రధాన మురుగు కాలువ

- మున్సిపాలిటీలో కుచించుకుపోతున్న మురుగు కాలువ
- రోడ్లపై పారుతున్న వర్షపు నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పలు మేజర్ డ్రెయినేజీలు ఆక్రమణలకు గురయ్యాయి. మరికొన్ని కుచించుకుపోగా కొన్ని కన్పించకుండా పోయాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడు కాలనీల్లో, రోడ్లపై వరదనీరు పారుతోంది. ఇప్పటికే ఆక్రమణలు జరిగిన కొన్నిచోట్ల ఇళ్లలోకి సైతం వర్షపు నీరు చేరుతోంది. ఏటా మురికి కాలువల్లో పూడికతీత పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ప్రతీ సంవత్సరం ప్రధాన కాలువ పూడికతీత పనులు చేపడుతున్నారే తప్ప ఆక్రమణలు తొలగించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు పట్టణ ప్రజల్లో విన్పిస్తున్నాయి.

వర్షాకాలంలో ఇబ్బందులు

ప్రధాన మురుగు కాలువ పరీవాహక ప్రాంతాలు ద్వారకానగర్, సంజీవయ్య కాలనీ, శ్రీకృష్ణనగర్ కాలనీ, కౌసర్‌నగర్ కాలనీల్లో చిన్నపాటి వర్షాలు పడితే చాలు మురుగు కాలువ ఉప్పొంగి నీరు వెళ్లలేక బ్యాక్ వాటర్ ఈ కాలనీల్లో చేరుతుంది. మున్సిపల్ అధికారులు ఆక్రమణల్లో మాయమైన కాలువను సర్వే చేసి గుర్తించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతులు..

ప్రధాన మురుగు కాలవ ఆక్రమణలకు గురవుతుందని ముంపు కాలనీల ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలుచోట్ల ఆక్రమణలు..

పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ తీరందాజ్ టాకీస్ వెనకాల ఉన్న మురుగు కాలువ స్థలం ఆక్రమణకు గురైంది. కన్యకాపరమేశ్వరి దేవాలయం సమీపంలోని ప్రధాన మురుగు కాలువ వంతెన సమీపంలో కూడా ఆక్రమణకు గురైంది. వార్డు నంబర్ 22లోని దోబీఘాట్ సమీపంలో 20 అడుగులు ఉండాల్సిన ప్రధాన మురుగు కాలువ 5 అడుగులకు కుచించుకుపోయింది. మురుగు కాలువపై ఇటీవల ఓ ఇంటి ప్రహరీ సైతం నిర్మించారు. దోబీఘాట్ నుంచి రైల్వేట్రాక్ వరకు 20 ఫీట్ల వెడల్పుతో ఉండాల్సిన ప్రధాన మురుగు కాలువ రెండు అడుగుల దూరం కూడా లేకుండా పోయింది.



ప్రయాణికుడా.. జరభద్రం!

కెరమెరి: మండలంలోని లేండిగూడ గ్రామానికి సమీపంలో ఉన్న గౌరి గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదం పొంచి ఉంది. బీటీరోడ్డుకు ఒకవైపు గుంత ఏర్పడి కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు రాత్రివేళ వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. పాదాచారులు, ద్విచక్రవాహనాలు మినహా ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు పడ్డ గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

కెరమెరిలో 'హరిత్ యోగా'

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యునాని ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం హరిత్‌యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ రియాజ్, యునాని ఫార్మసిస్ట్ లక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొక్కలే దేశానికి రక్ష అని పేర్కొన్నారు.



మొక్కలు నాటుతున్న చిన్నారులు

నిరుపయోగంగా భవనం



లింగాపూర్: మండల కేంద్రంలోని గత ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో ధరణి కార్యాలయ భవనాన్ని నిర్మించారు. నాలుగేళ్లయినా భవనం నేటికి ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రారంభానికి ముందే కిటికీలు, తలుపులు, అద్దాలు పగిలి ఉన్నాయి. దీంతో పశువులకు, మందుబాబులకు ఇది అడ్డాగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికై నా పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.